9- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/10/2026 12:06 AM Page 1


మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

శుక్రవారం 10 ఏప్రిల్ 2026 — పేజీలు : 4


## ఫేక్ హాల్ టికెట్లతో విద్యార్థుల మోసం

**తప్పుడు హాల్ టికెట్ల కలకలం...విద్యార్థుల భవిష్యత్ పై దెబ్బ**



వివరాలు 2లో..

గుంటూరులో జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో తప్పుడు హాల్ టికెట్ల కారణంగా విద్యార్థులు పరీక్షలకు దూరమై భవిష్యత్ నష్టపోయిన ఘటన కలకలం రేపింది.

## "ప్రజల కోసం నా కమిట్‌మెంట్...

## ▶పని చేయకపోతే దండం పెడతా"

◆సూరేపల్లిలో 'మీ భూమి--మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబు హెచ్చరిక

◆ఉచిత ఇసుక అమలులో నిర్లక్ష్యం... మైనింగ్ అధికారిపై అసహనం





బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో జరిగిన 'మీ భూమి-- మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ జిల్లాలో సరైన పంపిణీ జరగక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచిగా పని చేస్తే మీతో సర దాగా ఉంటా... పని చేయకపోతే దండం పెడతా" అంటూ అధికారులను హెచ్చరించారు.

వివరాలు 2లో..

ఉమ్మడి గుంటూరు జిల్లా రక్షణ బ్యూరో

### సూర్యలంక బీచ్‌ను 'మినీ గోవా'గా అభివృద్ధి

బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను మినీ గోవాగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సూర్యలంక ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ప్రజల ఆదాయం కూడా పెరుగుతుందని చెప్పారు.

### సి-వీడ్ బాటిల్‌తో స్వాగతం

పర్యావరణ పరిరక్షణ సందేశంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సి-వీడ్ బాటిల్ అందజేసి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.







### పాస్ పుస్తకం వచ్చింది..."

**మురాల వెంకటేశ్వర్లు, రైతు**

"దాదాపు 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన 25 సెంట్ల భూమి కి ఇప్పటివరకు పాస్ పుస్తకం రాలేదు. ఇప్పుడు రీ సర్వే చేసి పాస్ పుస్తకం ఇచ్చారు. దీంతో రుణాలు

### యాజిలి గ్రామానికి రూ.1 కోటి విరాళం

యాజిలి గ్రామానికి చెందిన గుండ్రెడ్డి సత్యనారాయణ స్వగ్రామ రహదారి అభివృద్ధి కోసం రూ.1 కోటి చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. గ్రామాభివృద్ధికి ముందుకొచ్చిన ఆయనను సీఎం అభినందించారు.



బాపట్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు సమర్థంగా పని చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. గంజాయి కట్టడి, మహిళల భద్రతలో జిల్లా పోలీస్ యంత్రాంగం చురుకుగా పని చేస్తోందన్నారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ నేతృత్వంలో పోలీసులు మంచి పనితీరు కనబరుస్తున్నారని ప్రశంసించారు. గంజాయి సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో గంజాయికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండదని స్పష్టం చేశారు.

### వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి హామీలు

**వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక పనులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.**

- తుంగభద్ర డ్రెయిన్‌పై బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.10 కోట్లు
- కొల్లూరు ఫెర్రీ రోడ్డుపై హెచ్‌ఎల్‌బీ నిర్మాణానికి రూ.15 కోట్లు
- భట్టిప్రోలు--పెసర్లంక రోడ్డుపై కల్వర్టుకు రూ.2 కోట్లు
- లంక గ్రామాలను వరద ముప్పు నుంచి రక్షించే చర్యలు
- వేమూరులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు
- ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

### సోషల్ మీడియా పరిచయం

## మాచర్లలో మహిళపై అత్యాచారయత్నం..

**ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం -- ఇంట్లోకి వెళ్లి దాడి**

**పోలీసుల వేగవంతమైన దర్యాప్తుతో నిందితుడు అరెస్ట్**

సోషల్ మీడియా పరిచయం ప్రమాదకరంగా మారిన ఘటన పల్నాడు జిల్లా మాచర్లలో వెలుగుచూసింది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వ్యక్తి ఇంటికి వెళ్లి మహిళపై అత్యాచారానికి యత్నించగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

మాచర్ల రక్షణ న్యూస్





వివరాలు 2లో..

## శానిటేషన్ ఇన్స్పెక్టర్ పై సస్పెన్షన్ వేటు

### పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్య వైఖరి

### ముగ్గురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

గుంటూరులో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కమిషనర్ మయూర్ అశోక్ కఠిన చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ వేటు విధించారు.

గుంటూరు రక్షణ న్యూస్



వివరాలు 2లో..

9- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/10/2026 12:06 AM Page 2



# ఫేక్ హాల్ టికెట్లతో విద్యార్థుల మోసం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరులోని ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కాలేజ్ యాజమాన్యం తప్పుడు హాల్ టికెట్లు ఇచ్చిందని ఆరోపించారు. పరీక్షా కేంద్రానికి వెళ్లిన విద్యార్థులను అనుమతించకపోవడంతో వారు కన్నీరు మున్నీరు అయ్యారు.రెండు సంవత్సరాల శ్రమ వృథా అయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.తల్లిదండ్రుల ప్రకారం, నీట్ పరీక్షలకు 40 మంది, జేఈఈ మెయిన్స్‌కు సుమారు 15 మంది విద్యార్థులు హాజరై నష్టపోయారు. గుంటూరులోని ఇందిరా ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీని పరీక్షా కేంద్రంగా కేటాయించినట్లు తెలిపారు.ఒకే ఆధార్ నంబర్‌తో తప్పుడు హాల్ టికెట్లు సృష్టించి విద్యార్థులను మోసం చేశారని యాజమాన్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# సోషల్ మీడియా పరిచయం...

మొదటి పేజీ తరువాయి

**మాచర్ల రక్షణ న్యూస్**

మాచర్ల పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ఓ మహిళకు రాజపాలెం గ్రామానికి చెందిన నాగుల శ్రీనివాస్ (అలియాస్ సంజు, శ్రీను) అనే వ్యక్తితో సోషల్ మీడియా యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ పరిచయం మరింత సన్నిహితంగా మారింది.

ఏప్రిల్ 2వ తేదీ మధ్యాహ్నం నిందితుడు ఆమె ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మహిళపై అత్యాచారానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు ప్రతిఘటించడంతో ఆగ్రహించిన నిందితుడు ఆమెపై దాడి చేసి తీవ్రంగా కొట్టి, కాళ్లు చేతులు కట్టేసి బెదిరించి అక్కడి నుంచి పరారయ్యాడు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు మాచర్ల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ జె.వి. సంతోష్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు నిర్వహించాయి. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, బాధితురాలి ఫోన్ డేటా ఆధారంగా నిందితుడిని గుర్తించి ఏప్రిల్ 8న మాచర్ల రైల్వే స్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. స్పష్టమైన ఆధారాలు లేకపోయినా వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకున్న మాచర్ల పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# "ప్రజల కోసం నా కమిట్‌మెంట్...

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి గుంటూరు జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. హెలికాప్టర్ ద్వారా ఉదయం సూరేపల్లి చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో బాపట్ల జిల్లా మైనింగ్ శాఖ పనితీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల కోసం రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకొని ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టామని, కానీ జిల్లాలో పంపిణీ సరిగా జరగకపోతే ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. అధికారుల పనితీరు మెరుగుపర్చాలని హెచ్చరించారు.ఇదే సభలో బాపట్ల జిల్లా పర్యాటకాభివృద్ధిపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించారు. జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి 'మినీ గోవా'గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. బీచ్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.అదే సమయంలో వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి పలు పనులను మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. తుంగభద్ర డ్రెయిన్‌పై బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.10 కోట్లు, కొల్లూరు ఫెర్రీ రోడ్డుపై హెచ్‌ఎల్‌బీ నిర్మాణానికి రూ.15 కోట్లు, భట్టిప్రోలు--పెసర్లంక రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వేమూరులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని కూడా హామీ ఇచ్చారు.సూరేపల్లి పర్యటనలో సీఎం స్థానిక రైతులతో పొలాల్లోనే మాట్లాడి సాగు పరిస్థితులు తెలుసుకున్నారు. రైతులు మురాల వెంకటేశ్వర్లు, వాకా శ్రీనివాసరావులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా యాజిలి గ్రామానికి చెందిన గుండ్రెడ్డి సత్యనారాయణ స్వగ్రామ రహదారి అభివృద్ధికి రూ.1 కోటి చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. గ్రామాభివృద్ధికి ముందుకొచ్చిన ఆయనను సీఎం అభినందించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్ర వర్మ, సీఎస్ సాయి ప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ ఇన్స్పెక్టర్ పై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తీవ్రంగా పరిగణించారు. గురువారం బాలాజీ నగర్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు.పారిశుధ్య పనులు సక్రమంగా జరగకపోవడంపై 3వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ (ఇంచార్జి) బి. రాజేశ్వరిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే 16, 18, 19 సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు సాగర్, ఏసమ్మ, హనుమాన్ సింగ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.బాలాజీ నగర్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుపోవడం, డ్రైనేజీ సమస్యలు, ఇంటింటి చెత్త సేకరణలో లోపాలు ఉన్నాయని గుర్తించారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పనితీరులో మార్పు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇకపై నిర్లక్ష్యం సహించబోమని, అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని, పనితీరు సరిగా లేకపోతే చర్యలకు సిఫారసు చేయాలని సూచి ంచారు.భవన నిర్మాణ వ్యర్థాలను తక్షణం తొలగించాలని, డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిర క్షణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# డంపింగ్ యార్డ్ పరిశీలన

**సత్తెనపల్లి రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, సత్తెనపల్లి డంపింగ్ యార్డ్‌లో ఉన్న సుమారు 19 వేల మెట్రిక్ టన్నుల చెత్తను త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. శానిటేషన్ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. గతంలో డంపింగ్ యార్డ్ నిర్వహణలో అవినీతి జరిగినట్లు ఆరోపించారు. డంపింగ్ యార్డ్‌ను తొలగించి అక్కడ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా రూ.15 కోట్ల వ్యయంతో ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి సమస్యలు రాకుండా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో సత్తెనపల్లి మున్సిపాలిటీ 20వ ర్యాంకులో ఉందని పేర్కొన్నారు.

9- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/10/2026 12:06 AM Page 3



# పల్లెల అభివృద్ధి పై ఫోకస్



**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

చిలకలూరిపేట నియోజకవర్గంలో పల్లెల అభివృద్ధిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక దృష్టి సారించారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.మూడు మండలాల ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అభివృద్ధి పనుల్లో చురుకుదనం చూపాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.పంచాయతీ నిధులను మౌలిక వసతుల కల్పనకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. రోడ్లు, కాలువలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగు పరచాలని, ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగం పెంచి పల్లెలలో ప్రత్యేక ముద్ర కనిపించేలా పనిచేయాలని ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

# ఆస్తి పన్ను రాయితీ

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుపై ఎర్లీ బర్డ్ ఆఫర్ ప్రకటించారు. ఏప్రిల్ నెలాఖరు లోపు ఆస్తి పన్నును ఏక మొత్తంగా ముందస్తుగా చెల్లించే వారికి అసలుపై 5 శాతం రాయితీ కల్పించినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.అదేవిధంగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిదారులకు వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. బకాయిలు ఉన్న వారు ఒకేసారి చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం జీఎంసీ ప్రధాన కార్యాలయం మరియు సర్కిల్ కార్యాలయాల్లో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సిబ్బంది విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.వేసవి దృష్ట్యా కౌంటర్ల వద్ద టెంట్లు, త్రాగునీరు, హెల్ప్ డెస్క్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నెలాఖరు లోపు పన్నులు చెల్లించి రాయితీలు పొందాలని కోరారు.

# ఆరోగ్య భవిష్యత్ లక్ష్యం



**పల్నాడు రక్షణ న్యూస్**

చిన్నారుల ఆరోగ్యం, పోషణ మెరుగుదలకు పోషణ పఖ్వాడా కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. గురువారం అమరావతిలో నిర్వహించిన స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో భాగంగా పోషణ పఖ్వాడా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడం ద్వారా భవిష్యత్ తరం పటిష్టంగా ఎదగాలని పేర్కొన్నారు. పోషణ పఖ్వాడా వంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతులు, పోషకాహారంతో కూడిన భోజనాలు, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ఉమాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్ల అక్రమణల పై కమిషనర్ సీరియస్

**గుంటూరు రక్షణ న్యూస్**




గుంటూరు నగరంలో రోడ్లపై ఇసుక, కంకర తదితర భవన నిర్మాణ సామాగ్రి, వ్యర్థాలు ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతున్నాయని నగర పాలక సంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో 48 గంటల్లోగా వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు.లేదంటే పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది స్వయంగా తొలగించి సంబంధిత భవన యజమానులపై భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నగరంలోని రహదారులపై నిర్మాణ వ్యర్థాలను అడ్డదిడ్డంగా వేయడంపై ప్రజల నుంచి విరివిగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.రోడ్లను ఆక్రమిస్తూ వ్యర్థాలను ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ సామాగ్రిని రోడ్లపై నిల్వ చేయకుండా, మున్సిపల్ అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే వ్యర్థాలను పారబోసాలని కమిషనర్ స్పష్టం చేశారు.

9- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/10/2026 12:06 AM Page 4



# సర్వే పనుల పరిశీలన

కారంపూడి రక్షణ న్యూస్



పల్నాడు జిల్లా కారంపూడి మండలం చింతపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ సంజన సింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూములు కలిగిన రైతులతో స్వయంగా మాట్లాడి రీ సర్వేపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.రీసర్వే నోటీసులు సక్రమంగా అందుతున్నాయా, ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారా అనే అంశాలపై రైతులను ప్రశ్నించారు. రైతులు తమ అభిప్రాయాలను స్వచ్ఛందంగా వెల్లడించారు.

సర్వే విధానాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నిర్ణీత గడువులోపు ఎలాంటి తప్పులు లేకుండా రీ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో గ్రామ రెవిన్యూ అధికారి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి భాను కీర్తి, తహశీల్దారు, మండల సర్వేయర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జీవాల పై పిడుగు



పెదకూరపాడు రక్షణ న్యూస్

పెదకూరపాడు నియోజకవర్గంలో అకాల వర్షం కారణంగా విషాదం చోటుచేసుకుంది. క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో వర్షాలు కురవగా, పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలో పిడుగుపాటుతో 14 గొర్రెలు మృతి చెందాయి.వర్షం పడుతున్న సమయంలో ఆశ్రయం పొందుతున్న గొర్రెలపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. ఈ ఘటనలో జీవాల యజమాని నల్లగొండ మల్లికార్జునకు తీవ్ర నష్టం వాటిల్లింది. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.తాను పెంచుకున్న మూగజీవాలు కళ్లముందే మృతి చెందడంతో బాధిత కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని మల్లికార్జున కోరుతున్నారు.

# మ్యూజియం పనుల వేగం

అమరావతి రక్షణ న్యూస్



అమరావతి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ధ్యానబుద్ధ కేంద్రం, కాలచక్ర మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్ష నిర్వహించారు.కాలచక్ర మ్యూజియంలో శుభ్రత పనులను తక్షణమే ప్రారంభించాలని, లండన్ ప్రదర్శనలో ప్రదర్శించిన స్మారక చిహ్నాలను త్వరగా అమరావతిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.మ్యూజియాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన కనీస పనులను పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అదనంగా అమరావతిలో పర్యాటక అభివృద్ధిపై సమీక్ష కోసం ఈ నెల 15న సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి నాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కోర్టు మంజూరు

వినుకొండ రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా వినుకొండలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుకు అనుబంధంగా అదనపు కోర్టు మంజూరు కావడంతో ఏర్పాట్లకు సంబంధించిన చర్యలు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా జడ్జి కళ్యాణ్ చక్రవర్తి వినుకొండలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.స్థానిక జడ్జి మహతి, ఆర్డీవో బాలకృష్ణ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ తదితరులతో కలిసి కోర్టు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. అవసరమైన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.అదనపు కోర్టు మంజూరు కావడంతో న్యాయవాదుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కోర్టు ఏర్పాటు ద్వారా ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజా భద్రతకు సీఎం ప్రశంస

## జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ నీ అభినందించిన సీఎం

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి కట్టడి, మహిళలపై నేరాల నివారణలో సమర్థవంతంగా పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో నిర్వహించిన "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.జిల్లాలో గంజాయి నిర్మూలనపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, గంజాయి సేవించి మహిళలపై దాడులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో గంజాయికి స్థానం లేదని స్పష్టం చేశారు.మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని కొనియాడారు. ప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందిస్తున్న జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ కార్యదక్షతను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రశంసించారు.

